పెద్దమారూరులో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్ ఎంపీ సీటును బహుమతిగా ఇద్దాం

- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి బహుమతిగా ఇచ్చి రుణం తీర్చుకుందామని ఎక్సైజ్ , పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పునూరు, పెద్దమారూరు, వెల్టూరు, అయ్యవారిపల్లి, చెల్లపాడు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వెల్టూరు గ్రామంలో నీటిసమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యను గమనించి సొంత ఖర్చుతో కేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.18లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి శాశ్వత పైపులైన్ , బోరు మోటర్లను మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా ట్రస్ట్‌చైర్మన్ కొత్త కల్యాణ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రావు, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్‌యాదవ్, బీచుపల్లియాదవ్, సుధాకర్, రాజ్‌కుమార్, హనుమంతురావు, నరేందర్‌గౌడ్, శ్రీను, జగదీశ్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, ఏప్రిల్ 28 : ఉండవెల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తావద్ద ఆదివారం రామాపురం డాక్టర్ జహంగీర్ బాషా హఫీజ్ క్లీనిక్ ఆధ్వర్యం లో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగారెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, షబ్బీర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పార్టీ అండ

అయిజ, ఏప్రిల్ 28 : పట్టణంలోని తెలుగుపేటకు చెందిన రాములు (69) పీజీకే లీలాశేఖర్(52)లు అకాల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు ఆదివారం ఆయా కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆల పరామర్శ

పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

కొత్తకోట, ఏప్రిల్ 28: మండలంలోని చర్లపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సంజీవరెడ్డి తల్లి పుష్పమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమోనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, నర్సింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చల్లా

ఉండవెల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని ఇటిక్యాలపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఇటీవల నాగిరెడ్డి, కేశవరెడ్డిలు గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆదివారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని మృతుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ ధైర్యం చెప్పారు. వీరి వెంట మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, గ్రామపెద్దలు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

నేను అనగా మహ్మద్ ముజిన్ ఉల్ అలి తండ్రి మహ్మద్ షఫీ ఉలాలి, , వయస్సు 57 సం॥లు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, హజిబీనగర్, మహబూబనగర్ జిల్లా, తేది:24-04-2024 రోజున ఇంటి నుండి ఆటోలో వెళ్ళుతుండగా 1టౌన్ పోలీస్ స్టేషన్ వెళ్ళే దారిలో నా ప్రాపర్టీ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1498/1985 పడిపోయినది. కావున దయచేసి ఎవరికైన దొరికినచో ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
Cell: 9490585806

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిముతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

సేవలు మరచి.. డిప్యుటేషన్‌పై దృష్టి

- వనపర్తి జిల్లాలో సగానికి పైగా వైద్య పోస్టులు ఖాళీ..
- ఎన్నికల కోడ్ ఉన్నా.. పైరవీలతో కావాల్సిన చోటుకు పోస్టింగ్
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు..
- ఉన్నత చదువులకోసం వెళ్లిన కొందరు వైద్యులు
- వైద్య సేవలు అందక రోగుల అవస్థలు

కడుకుంట్ల పీహెచ్‌సీ

వనపర్తి, ఏప్రిల్ 28 : జిల్లాలోని పలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరతతో రోగులు సతమతమవుతున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో సకాలంలో వైద్యం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పల్లె దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యులు డిప్యుటేషన్లు, తాత్కాలికంగా పలుచోట్ల వైద్య సేవలందిస్తుండటంతో సరైన సేవలందించలేకపోతున్నారు. దీంతో రోగులు ప్రభుత్వ దవాఖానల్లో వసతులున్నా వైద్య సేవలందక ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. పల్లె దవాఖానల్లో విధులు నిర్వహించాల్సిన వైద్యులు పీహెచ్‌సీల్లో ఉండడంతో ఆరోగ్య సేవల లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

పోస్టింగ్‌ల కోసం పైరవీలు..

పలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న కొందరు వైద్యులు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. దీంతో ఆ పోస్టులకు పైరవీలు చేయించుకొని అనుకున్న హోదాలో స్థిరపడుతున్నారు. దీంతో ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలందక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తతంగమంతా పానగల్, పెబ్బేర్, వనపర్తి రూరల్, ఘనపురం ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్నది. వైద్య సేవలను మర్చి డిప్యుటేషన్‌పై ఆసక్తి కనబర్చుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే డిప్యుటేషన్లు రద్దు చేసి ఎక్కడ వారు అక్కడే పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఇక్కడ మాత్రం డిప్యుటేషన్లు కొనసాగడం విడ్డూరంగా ఉందని జిల్లా వైద్యశాఖలోని పలువురు అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. జిల్లాలో 15 పీహెచ్‌సీలు ఉండగా.. ప్రతి కేంద్రానికి ఇద్దరు వైద్యులుండాలన్న నిబంధన ఉన్నది. కాగా జిల్లాలో 50 శాతం వైద్యులు లేకుండా తాత్కాలిక సేవలు అందిస్తున్నారు. ఓ కేంద్రంలో ఇద్దరు ఉంటే పీజీ కోసం ఒకరు వెళ్లిపోయారు. పలు కేంద్రాల్లో రక్త నమూనాలను సేకరించేందుకు ల్యాబ్ అసిస్టెంట్లు లేక రోగుల నుంచి రక్త నమూనాలను కూడా వైద్య సిబ్బందే సేకరిస్తున్నారు. పాన్‌గల్‌లో మూడు నెలలుగా వైద్యుడు లేక ఇబ్బందులు ఎదురవుతున్నా వైద్యశాఖ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

కొందరికి బాధ్యతలు అప్పగించాం..

జిల్లాలో వైద్యుల కొరత ఉన్నది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వాటిని భర్తీ చేస్తాం. డాక్టర్ల కొరత ఉన్న చోట బస్తీ, పల్లె దవాఖానల్లోని సిబ్బందితో ఆటంకం లేకుండా సేవలందిస్తున్నాం. అత్యవసర సేవల నిమిత్తం, ఆస్తకి ఉన్న కొందరికి డిప్యుటేషన్లు ఇచ్చాం.

- జయచంద్రమోహన్, డీఎంహెచ్‌వో, వనపర్తి జిల్లా

పీహెచ్‌సీల వారీగా వివరాలు..

సెంటర్ పేరు	ఉండాల్సిన వైద్యులు	ఖాళీ పోస్టులు
కొత్తకోట (పీహెచ్‌సీ)	02	01
పానగల్ (పీహెచ్‌సీ)	02	01
కడుకుంట్ల (పీహెచ్‌సీ)	01	01
పెబ్బేరు (పీహెచ్‌సీ)	02	01
తిప్డంపల్లి (పీహెచ్‌సీ)	02	02
పెద్దమందడి (పీహెచ్‌సీ)	02	01
వీపనగండ్ల (పీహెచ్‌సీ)	02	02
శ్రీరంగాపురం (పీహెచ్‌సీ)	02	01
ఆత్మకూరు (సీహెచ్‌సీ)	10	05
రేవల్లి (సీహెచ్‌సీ)	10	06
ఖిల్లాఘణపురం (సీహెచ్‌సీ)	10	07
వీపనగండ్ల (సీహెచ్‌సీ)	10	08

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీమెజార్టీతో గెలిపించాలి

కొత్తకోట, ఏప్రిల్ 28 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఆదివారం ఎంపీపీ గుంతమౌనిక కనిమెట్ట గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా కారు గుర్తుకు ఓటు వేస్తామని చెబుతున్నారని, తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి తప్పా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలతో గద్దెనెక్కిందని, గతంలో చేసిన తప్పు ఇప్పుడు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుంతమల్లేశ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంచంద్రయ్యయాదవ్, గాధం రాణి, పరమేశ్, సురేశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివయాదవ్, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎంపీ అభ్యర్థి పర్యటన

మద్దకల్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మండలంలో సోమవారం పర్యటిస్తున్నట్లు ఎంపీపీ రాజారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు మండలంలోని దాసరిపల్లిలో వెలిసిన సవారమ్మ గ్రామ దేవతను దర్శించుకుంటారన్నారు. అనంతరం సాయంత్రం 6గంటలకు మండలకేంద్రంలోని దశమికట్ట వద్ద ఎంపీ అభ్యర్థి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



కనిమెట్టలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

గ్రంథాలయానికి పుస్తకాలను వితరణ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సభ్యులు

వనపర్తి, ఏప్రిల్ 28 : మండలంలోని కడుకుంట్ల గ్రామంలోని వివేకానంద గ్రంథాలయానికి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో 50 పుస్తకాలను వితరణ చేసినట్లు అధ్యక్షుడు విజయ్ భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. విద్యార్థులకు చదువు, ప్రపంచంలోని విషయాలతోపాటు దైవత్వం, సంస్కృతులపై అవగాహన కల్గిందుకు త్రైత సిద్ధాంత ప్రబోధ పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివేకానంద గ్రంథాల య నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

మద్దకల్, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని దేవాలయం భక్తిమార్గ్‌లో ఇటీవలే రూ.40లక్షలతో సీసీ రోడ్డును వేశారు. గద్వాల–అయిజ రోడ్డు నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్లు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఎక్కడి వరకు వేస్తే నిధులు సరిపోతాయో అక్కడివరకు వేసి విడిచిపెట్టారు. కాగా ఆలయం వరకు పూర్తి కావాలంటే ఇంకా 100 మీటర్ల పొడవు సీసీరోడ్డు వేయాలి. దీనికి నిధులు లేకపోవడంతో అలాగే వదిలిపెట్టడంతో సీసీరోడ్డు ఎత్తుగా ఉండి కింద మట్టి రోడ్డు ఉండటంతో వాహనాదారులు, ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు సడెన్‌గా బ్రేకులు వేయడంతో చాలా మంది గాయాల పాలయ్యారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, వాహనాదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ప్రజల ఇబ్బందులను గుర్తించి మట్టి వేయాలని కోరుతున్నారు.

మద్దకల్ భక్తి మార్గ్‌లో ప్రమాదకరంగా మారిన సీసీ రోడ్డు

సారా పట్టివేత : కేసు నమోదు

గోపాల్‌పేట, ఏప్రిల్ 28 : నాటుసారా పట్టుకొని విక్రయదారుడిపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం ప్రకారం..రేవల్లి మండలంలోని కేశంపేట తండాకు చెందిన ముడావత్ దాసు వద్ద నుంచి ఆదివారం 10 లీటర్ల సారాను పట్టుకొని, అతడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా సారా తయారు చేసి విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీ గురుకుల ప్రవేశపరీక్ష విజయవంతం

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేశ్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష విజయవంతమైంది. ఉదయం 10 నుంచి 12గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు మొత్తం 11కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రవేశ పరీక్షను 8కేంద్రాల్లో నిర్వహించగా 1,747మంది విద్యార్థులకు గానూ 1,596మంది హాజరుకాగా 151 మంది గైర్హాజరవ్వగా 91. 36శాతం హాజరు నమోదైనట్లు పరీక్షల బీసీ గురుకుల ఇన్‌చార్జ్ అధికారి మధుసుదనాచారి తెలిపారు. అలాగే డిగ్రీ ప్రవేశ పరీక్ష కోసం 3కేంద్రాలు ఏర్పాటు చేయగా 492 మంది విద్యార్థులకు గానూ 448మంది విద్యార్థులు హాజరుకాగా 91.06 శాతం హాజరైనట్లు చెప్పారు.

ఈ పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ నగేశ్, ఇతర అధికారుల, సిబ్బంది తదితరులు పరిశీలించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

అ'పూర్వ' సమ్మేళనం

పెద్దమందడి, ఏప్రిల్ 28 : మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థి దశలోని జ్ఞాపకాలను పంచుకొని ఆనందంగా గడిపారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, మద్దిలేటి, వరప్రసాద్, ఇంద్ర, ధరణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్న దృశ్యం

విద్యార్థినులకు సన్మానం

విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలోని 9వ వార్డు మర్రికుంటకు చెందిన చీర్ల జాగృతి, మేఘన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. విషయం తెలుసుకున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి ఆదివారం విద్యార్థులకు ఇంటికి వేర్వేరుగా వెళ్లి విద్యార్థినులను శాలువాతో సన్మానించి అభినందించారు. జాగృతి సెకండియర్‌లో 980 మార్కులు, మేఘన ఇంటర్ ఫస్టియర్‌లో 440 మార్కులకు గా నూ 433 మార్కులు సాధించి ప్రతిభను చాటారన్నారు. ఆయనతోపాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ, నాయకులు కిరణ్‌కుమార్, చీర్ల జనార్దన్, నందిమల్లయా దయ్య, దివాకర్, కోహిత్ ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గట్టు, ఏప్రిల్ 28 : గట్టు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చెన్నయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని కోరారు. అధికారులు తమ నివేదికలను తప్పకుండా తీసుకరావాలని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొత్తకోట, ఏప్రిల్ 28 : మండలంలోని ముమ్మళ్లపల్లి గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారి వద్ద 40ఏండ్ల గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వ్యక్తి మృతి చెంది ఒకరోజు అయి ఉంటుందని తెలిపారు. ఆదివారం ఉదయం మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పరిశీలించగా శరీరంపై చొక్కా లేదని, ఒక జంజం కలిగి ఉన్నాడని తెలిపారు. వ్యక్తిని గుర్తిస్తే కొత్తకోట పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా ఎస్సై నెంబర్ 87126 70621కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ఉండవెల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని జోగుళాంబ హాల్ట్ సమీపంలో ఈనెల 25న రైలు కింద పడి అత్మహత్య చేసుకున్న యువకుడి ఆచూకీ లభ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని తక్కశిలకు చెందిన అయ్యన్న శేషమ్మ దంపతుల రెండో కూమారుడు సంపత్ (19) హైదరాబాద్‌లో కారు సర్వీస్ సెంటర్‌లో పని చేస్తుండేవాడు. తల్లిదండ్రులను చూడడానికి స్వగ్రామానికి వచ్చి 25న తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి జోగుళాంబ స్టేషన్ చేరుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారించి గద్వాల మార్చురీలో భద్రపర్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో మృతి చెందిన యువకుడు సంపత్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 28 : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రోజు రాత్రి ఇటిక్యాల పీయస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు పాన్‌గల్ మండలం అన్నారం గామానికి చెందిన మల్లి కార్జున్ గౌడ్(35) శనివారం రాత్రి బీచుపల్లి చెగువీరా దాబా వద్ద రోడ్డుదాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీపీఎం జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

పాన్‌గల్, ఏప్రిల్ 28 : జిల్లాకేంద్రంలో సోమవారం సీపీఎం జిల్లాస్థాయి సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వేణు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడమే సీపీఎం వైఖరన్నారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, జాన్‌వెస్లీ, జిల్లాకార్యదర్శి ఎండీ.జబ్బార్ హాజరవుతున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత : కేసు నమోదు

ఉండవెల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని పుల్లూరు టోల్‌గేట్ వద్ద నిర్వహిస్తున్న రెండు వైన్స్ షాపుల వద్ద చిరు దుకాణాలలో రాత్రి నిర్వహించిన తనిఖీలో 300 లీటరుల 875 మిల్లీ లీటకంల మద్యాన్ని పట్టుకున్న ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈడిగ నాగేంద్రగౌడ్, మురళీమోహన్ ఆచారి, మధు ముగ్గురు వ్యక్తులు వైన్స్‌షాపుల వద్ద చిరు దుకాణాలు నిర్వహిస్తున్నారు. భారీగా మద్యం చిరుదుకాణాల్లో నిల్వ ఉంచి రాత్రి 10 గంటల తర్వాత అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 300లీటర్ల 875మిల్లీ లీటర్లల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.లక్ష48వేల170 నిర్ధారించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.